


స్పందనలో 258 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సంతృప్తికరంగా, నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మండలస్థాయి ఆడిట్ కమిటీ ప్రతి సోమవారం పరిష్కరించిన స్పందన అర్జీలను ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తి, జెడిపిసిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, పోలవరం ఎస్‌డిసి సూర్యనారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ స్పందనలో 258 వినతులు స్వీకరించినట్లు తెలిపారు.

మాటలేనా.. చేతలేవి..!

ముందుకు సాగని 'వాటర్‌గ్రిడ్' పథకం
నాలుగేళ్లుగా సర్వేలతోనే కాలక్షేపం
డెల్టాలో గుక్కెడు నీటికోసం జనం అవస్థలు
గత ఎన్నికల్లో జిల్లా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీ ఇదే
రూ.3670 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు నిధుల కుదింపు
అయినప్పటికీ తాగునీరు అందించే చర్యలు శూన్యం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'వైసిపి అధికారంలోకొస్తే జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ వేసి వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా తాగునీరు అందిస్తాం. తమ ప్రభుత్వం రాగానే ముందుగా వాటర్‌గ్రిడ్ పథకం పూర్తిచేస్తాం..' ఇదీ 2019 ఎన్నికల్లో వైసిపి అధినేత జగన్ జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో జిల్లాప్రజలకు ఇచ్చిన హామీ. అధికారం చేపట్టి నాలుగేళ్లు గడిచిపోయింది. పథకాన్ని కుదించడమే కాకుండా ఇప్పటికీ సర్వేల పేరుతో కాలక్షేపం చేస్తూనే ఉన్నారు. వైసిపి వాటర్‌గ్రిడ్‌పై మాటిచ్చి మరిచిపోవడంపై జిల్లా ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రెండు జిల్లాల్లో విచ్చలవిడిగా సాగిన చేపలు, రొయ్యల చెరువుల కారణంగా తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. ముఖ్యంగా డెల్టా మండలాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. దశాబ్దకాలంగా జనం తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు లేక అల్లాడిపోతున్నారు. డబ్బు చెల్లిస్తే తప్ప గొంతు తడవని పరిస్థితి నెలకొంది. 2014లో టిడిపి ప్రభుత్వం ప్రతీ ఇంటికి 20 లీటర్ల తాగునీరు అందిస్తామంటూ హామీ ఇవ్వడంతో ఉమ్మడిజిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలను గెలుచుకుంది. గెలిచిన తర్వాత తాగునీరు అందించకుండా జనాలను మోసం చేసింది. దీంతో ఆ పార్టీపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ తరుణంలో వైసిపి 2019 ఎన్నికల్లో తాగునీటి సమస్యను ఒక అస్త్రంగా ఉపయోగించుకుంది. జగన్ తన పాదయాత్ర జిల్లాలో జరిగినప్పుడు ఇదే ప్రధానంశంగా మారింది. బాటిల్‌లో నీళ్లు చూపించి ఈ నీరు మనుషులు తాగుతారా అంటూ జగన్ జనాలను ప్రశ్నించేవారు. వైసిపి అధికారంలోకొస్తే వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేసి గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ ద్వారా అప్పటి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 48 మండలాలకు సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇది నమ్మిన ప్రజలు వైసిపిని 13 అసెంబ్లీ స్థానాల్లో గెలిపించారు. అధికారంలోకొచ్చిన వెంటనే వాటర్‌గ్రిడ్ పథకంపై ప్రజాప్రతినిధులు చాలా హడావుడి చేశారు. దీంతో ఇంకేముంది సురక్షితమైన తాగునీరు వస్తాయని ప్రజలు సంతోషించారు. వాటర్‌గ్రిడ్ పథకానికి రూ.3,670 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెండేళ్లలో ఈ పథకం పూర్తిచేస్తామని చెప్పారు. గోదావరి నదిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, అరికిరేవుల, పట్టిసీమ మొత్తం ఐదుచోట్ల పంపింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ల ద్వారా తాగునీరు ఇవ్వనున్నట్లు తెలిపారు. నరసాపురం, భీమవరం ప్రాంతాల మీదుగా ఒక పైప్‌లైన్, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు వరకూ ఒకటి, పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం, చింతలపూడి, లింగపాలెం వరకూ ఇంకో లైన్, కొవ్వూరు, గోపాలపురం, నల్లజర్ల మీదుగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పైప్‌లైన్లకు మధ్యలో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు సైతం ఏర్పాటు చేసి రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

సర్వేలతో కాలక్షేపం

వాటర్‌గ్రిడ్ పనులు నేటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదు. దీంతో జనాలనుంచి విమర్శలు రావడంతో మరో కొత్త ప్రణాళిక రూపొందించారు. మెట్ట ప్రాంతం వదిలేసి డెల్టాలోని 27 మండలాలకు వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. నిధులు రూ.3,670 కోట్లనుంచి రూ.1400 కోట్లకు కుదించారు. డెల్టా పరిస్థితి దారుణంగా ఉండటంతో ముందుగా ఇక్కడైనా పూర్తయితే ప్రజలకు మేలు జరుగుతుందని అంతా సర్దుకున్నారు. నాలుగేళ్లు గడిచిపోయింది. మరో ఏడాదిలో వైసిపి ప్రభుత్వం పదవికాలం ముగుస్తోంది. వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి టెండర్లు ప్రక్రియ పూర్తయిందని, మెగా కంపెనీ దక్కించుకున్నట్లు చెబుతున్నారు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఎవరైనా అడిగితే ఇంకా సర్వే జరుగుతుందంటూ చెబుతున్నారు. సర్వే ఎప్పటికి పూర్తవుతుందో, వాటర్‌గ్రిడ్ పనులు ఎప్పటికి మొదలవుతాయో.. ప్రజలకు తాగునీరు ఎప్పుడు అందిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు రోడ్ల మరమ్మత్తులకు శంకుస్థాపనలు చేసి హడావుడి చేసినట్లు.. ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం వాటర్‌గ్రిడ్‌పై మళ్లీ హడావుడి చేసే పరిస్థితి ఉందని అంతటా చర్చ సాగుతోంది. తాగునీరు కోసం అల్లాడుతున్న ప్రజలను ప్రభుత్వాలు చేస్తున్న మోసాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

14 నుంచి వామపక్షాల ప్రజాందోళన

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక నిరంకుశ పాలనపై ఈనెల 14వ తేదీ నుండి 30 వరకూ సిపిఐ, సిపిఎం చేపట్టనున్న ప్రజాందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌ఆర్.పేట, స్ఫూర్తిభవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణచైతన్య, ఎ.రవి మాట్లాడుతూ బిజెపి కార్పొరేట్ మతోన్మాద విధానాలను ప్రజలు ఎండగట్టాలని, అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో ప్రజల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని విమర్శించారు. మోడీ అధికారం చేపట్టిన తరువాత దేశంలో అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సభ్యులకు కారుచౌకగా కట్టబెట్టి ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. జిఎస్‌టి భారాలు, మతోన్మాదం, పౌరసత్వం, ఢిల్లీలో దాడులు, మతమార్పిడిలు, మైనార్టీలపై దాడులు, దళితులపై దాడులు, మనుధర్మ శాస్త్ర ప్రయోగం, వంటి అప్రజాస్వామిక విధానాలను నిరసిస్తూ, అవినీతిని యథేచ్ఛగా చేస్తూ ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాఫెల్, అదానీ కుంభకోణం, వంటి వాటిపై కనీసం విచారణ సైతం చేపట్టకపోవడం చూస్తుంటే మోడీ, అమిత్ షా, భారత ప్రభుత్వాన్ని అదానీ, అంబానీలు కంపెనీలాగా మార్చివేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంపై దాడి చేసేలా వ్యవహరిస్తూ దేశంలోని నవరత్న కంపెనీలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, ధరలు పెంచడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా షరతులు విధించి అదనపు భారాలు మోపడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రానికి ఏ మాత్రమూ తీసిపోకుండా విద్యుత్ ఛార్జీల పెంపు, చెత్తపన్ను, ఆస్తి పన్ను అంటూ ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహంపై పల్లెత్తుమాట కూడా అనకుండా కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దతిస్తున్న వైసిపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, బిజెపి మతోన్మాదంపై నోరెత్తకపోవడం, మైనారిటీలు, దళితులపై దాడులు జరుగుతున్నా సిఎం జగన్ తన కేసులకు భయపడి మౌనంగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. అదానీ కంపెనీలకు రాష్ట్ర వనరులు, సంపద, పోర్టులు కట్టబెడుతున్నారని విమర్శించారు. పార్లమెంటులో వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ చట్టం, తదితర ప్రజావ్యతిరేక చట్టాలకు మద్దతివ్వడం, ప్రత్యేకహోదా, విభజన హామీలపై నిలదీయకపోవడం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణపై నోరు మెదపకుండా, కేంద్ర ప్రభుత్వ షరతులకు లొంగిపోయారన్నారు. అందరికన్నా ముందే నూతన విద్యా విధానం అమలుచేయడం, స్మార్ట్ మీటర్లు బిగించడం, ఉపాధిహామీ పథకంలో కోతలు, నిబంధనలు మార్చడం, అమలు చేయడం వంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేలా పోరాటాలకు రూపకల్పన చేశామని తెలిపారు. ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి విధానాలపై పల్లెత్తు మాటమాట్లాడకపోవడం రాష్ట్ర అభివృద్ధికి విఘాతమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూ, రాష్ట్ర సత్వర అభివృద్ధికి కేరళ వామపక్ష ప్రభుత్వం తరహా ప్రత్యామ్నాయ విధానాలతో ఏప్రిల్ 14 నుండి 30వ తేదీ వరకూ ప్రచార ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సిపిఐ(ఎం)జిల్లా కార్యవర్గ సభ్యులు పళ్లెం కిషోర్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి తరలిన కార్మికులు, రైతులు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీకి సిఐటియు, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ఏలూరు రైల్వేస్టేషన్ నుండి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు బయలుదేరి వెళ్లారు. ముందుగా స్థానిక మెయిన్ రైల్వే స్టేషన్‌లో చలో ఢిల్లీకి వెళ్తున్న వారికి వీడ్కోలు పలికారు. కార్మిక, కర్షక ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం సంక్షోభంలో కురుకుపోయిందని చెప్పారు. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఇందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఉపాధ హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 200 రోజులు పని దినాలు, రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.సాయిబాబా, బి.జగన్నాథం, తుమ్మల సత్యనారాయణ, శేషపు మహంకాళి, బొడ్డు రాంబాబు, అనుమోలు మురళీ పాల్గొన్నారు.

ముదినేపల్లి :ఢిల్లీలో ఈ నెల 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి ముదినేపల్లి మండలం నుంచి సోమవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిన్నం మాధవ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వణుదుర్రు గ్రామస్తులు మాధవకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం కావాలంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం

ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా ప్రజలకు గిఫ్ట్‌కార్డుల రూపంలో వల వేస్తున్నారన్నారు. ప్రజలు ఎటువంటి ప్రలాభాలకు లొంగకుండా ఉంటే సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా క్షయ నివారణ అధికారి వారి కార్యాలయ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం ఎన్‌టిఇపి స్కీంలో సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్ వైజర్(ఎస్‌టిఎస్) సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్ (ఎస్‌టిఎల్‌ఎస్), డిఆర్ టిబి సెంటర్ గణంకాల అసిస్టెంట్, ఆర్‌ఎన్ టిసిపి ల్యాబ్ టెక్నిషియన్/కఫం మైక్రోస్కోపిస్ట్, క్షయవ్యాధి హెల్త్ విజిటర్(టిబిహెచ్‌వి) పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్స్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారం ప్రొవిషనల్ మెరిట్ లిస్ట్ తయారుచేసిన అనంతరం జిల్లా వెబ్‌సైట్ westgodavari.ap.gov.in, eluru.ap.gov.in పొందుపరిచినట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.ఆశ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ జి.రత్న కుమారి సంయుక్త ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ప్రొవిషనల్ మెరిట్ లిస్ట్‌ను చూసిన అనంతరం ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటికి సంబంధించిన తగు ధ్రువీకరణ పత్రాలతో జిల్లా క్షయ నివారణ అధికారి వారి కార్యాలయంలో ఈ నెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు సమర్పించాలని తెలిపారు.

దోసపాడు దళితుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ఏలూరు



సాబ్జీకి వినతిని అందిస్తున్న నాయకులు

దోసపాడు పేదలు, దళితులు పది నెలల నుండి తమ భూముల కోసం నిరంతర పోరాటం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. ఈ భూపోరాటంలో భాగంగా సోమవారం ఎంఎల్‌సి షేక్ సాబ్జీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పి.రామకృష్ణ మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమైన దోసపాడు భూ పోరాటం పేదలకు, దళితులకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఈ పోరాటంలో పేదలు, దళితులు పలుమార్లు మండల రెవెన్యూ శాఖ అధికారులను, జిల్లా అధికారులను కలిసి గోడు విన్నవించుకున్నప్పటికీ కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. పేదల హక్కులను కాలరాస్తూ, దళితుల చట్టాలను నీరుగారుస్తూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కట్టి మూడు నెలలు దాటినప్పటికీ ఆ కేసులో ఉన్న నిందితులను అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలపై జిల్లాకోర్టును ఆశ్రయించగా కోర్టు పేదలకు అనుకూలంగా భూములు సాగు చేసుకోవచ్చని చెప్పినా రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కోర్టు ఆదేశాలు ధిక్కరించిన అధికారులపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదల ఓట్లతో గెలిచిన ఎంఎల్‌ఎ, మంత్రులు దోసపాడు దళితులు, పేదలు కనబడటం లేదా అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దోసపాడు దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఎవరైతే నిందితులు ఈ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఉన్నారో వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో 144, 145 సెక్షన్లు ఎత్తివేసి పేదలకు రక్షణ కల్పించాలన్నారు. ఎవరైతే భూములు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారో వారిపై అసైన్మెంట్ యాక్ట్ సెక్షన్-4 ప్రకారం అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతూ దళితుల పోరాటానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిల మద్దతు ఉంటుందన్నారు. పేదల తరుపున కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో, జెసి అరుణ్‌బాబుతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా, న్యాయం చేసే విధంగా పేదల తరపున మాట్లాడుతానని చెప్పారు. తమకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎ.రవి, ఎం.జీవరత్నం, పి.కిషోర్, ఎం.శ్రీనివాస్ పి.ఆనందరావు, డి.గంగాధర్, సిహెచ్.భూషణం, కె.ప్రసాద్, సిహెచ్.జాన్‌రాజ్ పాల్గొన్నారు.

రబీ ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవ్వాలని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో రబీ ధాన్యం సేకరణ కార్యాచరణ, శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైయిస్, సహకార, వ్యవసాయ, రవాణాశాఖ, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, సొసైటీల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు రబీ ధాన్యం సేకరణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో కొత్త విధానం ద్వారా ధాన్యం కొనుగోలును విజయవంతం చేయడంలో సహకరించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఖరీఫ్‌లో గుర్తించిన లోటుపాట్లను సరిచేసుకొని ప్రస్తుత రబీలో రైతులకు మరింత మేలు జరిగేలా ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల ఇంకా ధాన్యం కోతలు జరుగుతున్నాయన్నారు. ఈ-పంట నమోదు కూడా పకడ్బందీగా జరిగిందన్నారు. జిల్లాలో 78,996 ఎకరాల్లో ఇ-కెవైసి పూర్తయిందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని వరికోతలు కొంత వాయిదా వేసుకోవాలని ఆయన సూచించారు. రబీధాన్యం సేకరణకు అవసరమైన గోనెసంచులు, రవాణా సౌకర్యంపై ఇప్పటినుండే పూర్తి దృష్టి పెట్టాలన్నారు. కనీస మద్దతు ధరకన్నా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువ లభిస్తే అందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి డేటా ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు పూర్తిస్థాయి శిక్షణను ఈవారంలో అందించనున్నట్లు తెలిపారు. రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ విజయవంతం అయినందుకు మిల్లర్ల తరపున ధన్యవాదాలు తెలిపారు. ట్రక్ షీట్ జనరేషన్ గోనెసంచులు సరఫరాకు సంబంధించి పలు సూచనలు చేశారు. వైఆర్‌కెపిఆర్ బాబ్జి, పలువురు ట్రాన్స్‌పోర్టరు రబీధాన్యం సేకరణకు సంబంధించి పలు విషయాలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. రబీ ధాన్యం సేకరణను విజయవంతం చేసేం దుకు తామంతా పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సమా వేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, ఆర్‌డిఒలు కె.పెంచల కిషోర్, ఝాన్సీరాణి, జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ, పౌర సర ఫరాల జిల్లా మేనేజర్ మంజూభార్గవి, జిల్లా వ్యవసా యశా ఖాధికారి వై.రామకృష్ణ, జిల్లాపౌర సరఫరాల అధికారి సత్య నారాయణరాజు, జిల్లా రవాణా శాఖాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు శేషగిరిరావు దంపతులు

వందో పుట్టినరోజు సందర్భంగా రూ.2 రెండు కోట్ల వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు


పుట్టినరోజు వేడుకల్లో శేషగిరిరావు దంపతులు

వందో పుట్టినరోజు సందర్భంగా సమాజ సేవ కోసం రూ.2 కోట్లు వితరణ చేసిన శేషగిరిరావు, కమలాదేవి దంపదులు ఆదర్శప్రాయులని పలువురు అభినందనలు తెలిపారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన అప్పసాని శేషగిరిరావు వందవ పుట్టినరోజు వేడుకలు ఈ నెల రెండో తేదీ రాత్రి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ జిల్లా కోకోపేటలో వైభవంగా నిర్వహించారు. పలువురు నారాయణపురం గ్రామస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషగిరిరావు దంపతుల నుంచి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం శేషగిరిరావు కుమారులు రవికుమార్ సేవా కార్యక్రమాలు, సమాజాభివృద్ధికి ఆర్థిక సాయాన్ని ప్రకటించి చెక్కులు అందించారు. హృదయ ఫౌండేషన్‌లో వంద మంది చిన్నారులకు గుండె ఆపరేషన్ నిమిత్తం రూ .కోటి, కృష్ణా జిల్లాలో చెరుకూరి వృద్ధాశ్రమానికి రూ.50 లక్షలు, నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.25 లక్షలు, కేన్సర్ ఆసుపత్రికి రూ.25 లక్షలు శేషగిరిరావు కుమారుడు వితరణ చేసినట్లు నారాయణపురం మాజీ సర్పంచి, తెలుగు మహిళ నాయకురాలు అక్కిన నాగమణి సోమవారం స్థానిక విలేకరులకు చెప్పారు. ఉంగుటూరులో నిర్మాణంలో ఉన్న ఆనంద నిలయానికి శేషగిరిరావు కుమార్తెలు వెంకటసుబ్బలక్ష్మి, డాక్టర్ శశికళ చెరొక రూ.లక్ష చొప్పున రూ.2 లక్షల విరాళాలు అందించారు. నారాయణపురం నుంచి గుణ్ణం బుల్లెబ్బాయి, ఆక్కిన భాస్కరరావు, ముళ్లపూడి కృష్ణమోహన్, అక్కిన నాగమణి ఆదిరెడ్డి సత్యనారాయణ వెళ్లారు. సంపాదనలో కొంత సమాజసేవ కోసం వినియోగించడంలో ఉన్న తృప్తి మరెక్కడ దొరకదని విరాళం ఇచ్చిన దాతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా తొలిరోజు పది పరీక్షలు

22,853 మంది హాజరు - 374 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఏలూరు


పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రశాంత వాతావరణంలో జిల్లాలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని కెబిడిటి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు 23,227 మంది విద్యార్థుల కుగాను 22,853 మంది (98.39 శాతం) విద్యార్థులు హాజరయ్యారని, 374 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌లకు పలు సూచనలు జారీ చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కనీసం మందులతోపాటు ఎఎన్‌ఎం ఏర్పాటు చేశామని, మాస్ కాపీయింగుకు తావు లేకుండా ప్రతీ కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.రవిసాగర్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ 52 పరీక్షా కేంద్రాలు, కలెక్టర్ అండ్ జిల్లా మేజిస్ట్రేట్, ఏలూరు వారు ఒక పరీక్షా కేంద్రం, జెసి ఒక పరీక్షా కేంద్రం, జిల్లాస్థాయి పరిశీలకులు ఐదో పరీక్షా కేంద్రాలు, డిఇఒ నాలుగు పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లాలో పదో తరగతి పరీక్షలు తొలిరోజు సమర్ధవంతంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావం ణంలో జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ తెలిపారు. ఏలూరు నగరంలో పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో పరీక్షా కేంద్రాలను ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు పరీక్షా కేంద్రాలకు వెళ్ళి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సదుపాయాలు, ప్రాంగణంలో పోలీస్ బందోబస్తు, మెడికల్ క్యాంపును పరిశీలించారు. నగరంలో, జిల్లావ్యాప్తంగా ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, సహాయక సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లకూడదని చెప్పారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందనీ, జిరాక్స్ కేంద్రాలుం తెరిచి ఉంచకూడదని చెప్పారు. జిల్లాఎస్‌పితో పాటు డిసిఆర్‌టి సిఐ ఎం. సుబ్బారావు, ఏలూరు త్రీటౌన్ సిఐ వరప్రసాద్, వన్ టౌన్ సిఐ బోణం ఆదిప్రసాద్, పోలీస్ అధికారులు ఉన్నారు.

పోలవరం :మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గూటాల జిల్లా పరిషత్ పాఠశాల రెండు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం, వైద్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు సౌకర్యాలు కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొబ్బిలి స్వరూప్ తెలిపారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లే సందర్భంలో డిఎస్‌పి కె.లతాకుమారి ఆధ్వర్యంలో ఎస్.పవన్‌కుమార్, మహిళా పోలీసులు విద్యార్థులను తనిఖీ చేశారు. రెండు పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి కె.లతాకుమారి తెలిపారు. గూటాల జిల్లా పరిషత్ పాఠశాలలో 98 మంది విద్యార్థులకు 96 మంది పరీక్షలకు హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యారనిఉపాధ్యాయులు తెలిపారు.


ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి


పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యనారాయణ

కూలీలు ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని కోరగుం టపాలెంలో సోమవారం 2023-2024 వార్షిక పనులను ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలకు ఉపాధిని కల్పిస్తూ ఆర్థిక భరోసా వెసులుబాటును కల్పించడం సంతోషదాయకమన్నారు. ఈ చటాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పేరే రామకృష్ణ, గ్రామ సొసైటీ ఛైర్మన్ అచ్యుత రాంబాబు, వైసిపి నేతలు విష్ణువర్ధన్, రాచూరి కుమార్, బండి శివాజీ, దివి సతీష్, పరసా నాగమల్లేశ్వరరావు, టిఎ వి.గోపాలకృష్ణ , ఫీల్డ్ అసిస్టెంట్ మద్దా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

మొదటి విడత జాబితాలో చేర్చాలని ధర్నా

ప్రజాశక్తి - కుక్కునూరు

పూర్తి ముంపులో ఉన్న కొత్తూరు, మర్రిపాడు గ్రామాలను మొదటి విడత జాబితాలోకి చేర్చి పరిహారం ఇవ్వాలని కోరుతూ సోమవారం నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితులు ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు తమ ఇళ్లు మునిగి సర్వం కోల్పోయారని సంబంధిత అధికారులు సర్వే జరిపి కొత్తూరు, మర్రిపాడు గ్రామాలను 41.15 కాంటూరు మొదటి విడత పరిహారపు జాబితాలో చేర్చి పునరావాస పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ప్రమాద్వారకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు షేక్ అకుమ, ఖాసీం, సుబాన్, కరీమ్, హుస్సేన్ రామారావు, నాగులమీరా పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆహారంతో పాటు చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా గర్భిణులకు, బాలింతలకు మంచి పోషకాహారం ఉంటుందని ఎంపిడిఒ కె.మంగతాయారు అన్నారు. జీలుగుమిల్లి అంగన్‌వాడీ కేంద్రం-3లో సోమవారం పోషకాహార పక్షోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. దానికి తోడు సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలు వివిధ ఆహారంతో పాటుగా తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. సర్పంచి చిర్రి జగదాంబ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తున్నదన్నారు. అనంతరం గ్రామంలోని కొంతమంది గర్భిణులకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీహారతి చేతుల మీదుగా శ్రీమంతాలు చేశారు. అనంతరం వెల్ బేబీ షోను నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన పిల్లలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ తులసి, అంగన్‌వాడీ కార్యకర్త సరళకుమారి,ఆయా పాల్గొన్నారు.

ముసునూరు :తినే ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే గర్భిణులకు, బాలింతలకు మంచి పోషకాహారం అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎ.శ్రీలక్ష్మి అన్నారు. పోషణ పక్వాడా ముగింపు కార్యక్రమం మండల కేంద్రమైన ముసునూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మేరీ సులోచన, పి.రాజకుమారి, ఆయాలు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి ఊయల వితరణ

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి సోమవారం రాజమండ్రి పట్టణానికి చెందిన మడిచర్ల సుధాకరరావు, వెంకటలక్ష్మి దంపతులు రూ.35 వేల విలువైన బేకు ఉయ్యాలను వితరణ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్.సంగమేశ్వరశర్మ మంగళంపల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఉయ్యాల వితరణ చేసిన దంపతులు వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ సిబ్బంది వెంకటరాజు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పోలవరం

వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టిసీమ, ప్రగడపల్లి, చేగొండపల్లి, ఇటుకలకోట గ్రామాల్లో వర్షానికి నేల కూలిన వరి, మొక్కజొన్న, అపరాల పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, మొక్కజొన్న, అపరాల పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయని, నష్టపోయిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నిర్వహించి, ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని, రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, టిడిపి ఎప్పుడు రైతులకు అండగానే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీనివాసరావు, పట్టిసీమ సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, నునకాని రాంబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆకుల రాజా, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి జితేంద్ర, పూడి శ్రీను, పసుపులేటి బుజ్జి, కర్రి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా అందజేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండల పరిషత్ అభివృద్ధి అధికార కార్యాలయ ఆవరణలో ఈ నెల మూడో తేదీ మంగళవారం మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏరియా కో-ఆర్డినేటర్ దయాల రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. నూజివీడు వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రూ.15.49 కోట్లు 15 967 మంది మహిళల ఖాతాల్లో వేయనున్నట్లు తెలిపారు.

వాలంటీర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సేవా దృక్పథంతో పని చేసేవారిని వాలంటీర్లగా నియమిస్తున్నామని, అందరు ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా పని చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని బొమ్మినంపాడు, గురజ గ్రామాల్లో నూతన వాలంటీర్లగా నియమించబడిన వారికి ఎంపిపి సత్యనారాయణ నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శులు జి.రమేష్, వై.శ్యాంసుందర్, గిరిజ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

జంగారెడ్డిగూడెంలో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక డాంగేనగర్‌లో ఇంటి తాళాలు పగలుకొట్టి బంగారు, వెండి, వస్తువులతో పాటు నగదు అపహరించిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. డాంగేనగర్‌కు చెందిన కూనపరెడ్డి నరసింహారావు, నాగ సంధ్యామణి దంపతులు నరసాపురంలో జరిగే పెళ్లి వేడుకకు ఈ నెల రెండో తేదీన వెళ్లి తిరిగి ఏప్రిల్ మూడో తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఇంటికి చేరుకున్నారు. వారు వచ్చేసరికి ఇంటి తాళం పగలు కొట్టి ఉండటం చూసి కంగారుగా లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లో బీరువాలో 12 కాసుల బంగారం, అరకిలో వెండి, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయగా క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు.

'పది' పరీక్షలు ప్రారంభం



టి.నరసాపురంలో పది విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ, మండలంలో కలిపి ఎనిమిది కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు సోమవారం 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1731 మంది విద్యార్థులకు 1709 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

టి.నరసాపురం : మండలంలో సోమవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి తెలిపారు. మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా మండలంలోని బొర్రంపాలెం-285, టి.నరసాపురం-170, అప్పలరాజుగూడెం-79 మొత్తం 534 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని బొర్రంపాలెంలో ముగ్గురు, టి. నరసాపురంలో ఒకరు పరీక్షకు హాజరు కాలేదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఇఒతో పాటు ఎస్ఐ కె.సతీష్‌కుమార్, తహశీల్దార్ జెవి.సుబ్బారావు పరిశీలించారు.

ముసునూరు : గోపవరం హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 285 మందికి ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. చెక్కపల్లి హైస్కూల్‌లో 135 మందికి తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. ముసునూరు హైస్కూల్‌లో 187 మంది హాజరవ్వగా 15 మంది గైర్హాజరయ్యారు.

కలిదిండి : పదో తరగతి పరీక్షల తొలి రోజు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ కొల్లాటి నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆరు తెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 168 మంది విద్యార్థులకు నలుగురు గైర్హాజరయ్యారు. కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 248 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ సెంటర్లో 172 మందికి నలుగురు గైర్హాజరయ్యారు. బి సెంటర్లో 171 మంది 171 మంది విద్యార్థులు హాజరయ్యారు. భాస్కరరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 134 మందికి ఒక విద్యార్థి గైర్హాజరవ్వడంతో 133 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. మొత్తం 893 మంది విద్యార్థులకు గాను 883 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

చాట్రాయి : మండలంలో ఆరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, మూడు ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 223 మంది హాజరవ్వాల్సి ఉండగా 219 మంది హాజరయ్యారన్నారు. సప్లమెంటరీ విద్యార్థులు ముగ్గురు, రెగ్యులర్ విద్యార్థి ఒకరు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ జి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్‌సిఎం పాఠశాలలో 198 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు విద్యాశాఖాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. మొత్తం రెండు పరీక్ష కేంద్రాల్లో సజావుగా పరీక్షలు జరిగినట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 187 మంది విద్యార్థులకు 183 మంది హాజరయ్యారని నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. బర్రింకలపాడు గురుకుల పాఠశాలలో 233 మందికి 224 మంది హాజరయ్యారు. తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 420కి 409 మంది హాజరు, 13 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

మండవల్లి : మండవల్లి, చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 259 విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరయ్యారు. చింతపాడులో 115 మంది పరీక్షకు హాజరయ్యారు. గతేడాది చోటు చేసుకున్న మాస్ కాపీయింగ్ నేపథ్యంలో అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండే విధంగా ఈ సంవత్సరం విద్యాశాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలుపరచడంతో పాటు కైకలూరు సిఐ వైవిఎల్.నాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎఎస్ఐ కాకోళ్ల రాజుతోపాటు సిబ్బంది పోలీస్ సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

భీమడోలు :మండల పరిధిలోని వివిధ



భీమడోలులో అధికారుల తనిఖీలు

ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలతో పాటు ఇతర మండలాలకు చెందిన 911 మంది పదో తరగతి విద్యార్థులు జబ్లింగ్ విధానంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. నాలుగు ప్రభుత్వ పాఠశాలలతో పాటు పొలసానిపల్లిలోని బాలయోగి గురుకులం బాలికల పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ భీమడోలు హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని, భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్, పొలసానిపల్లి గురుకులం పరీక్షా కేంద్రంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సోమవారం జరిగిన పరీక్షకు ఎనిమిది మంది విద్యార్థులు హాజరు కాలేదని భీమడోలు మండల విద్యాధికారి డి.సాంబశివరావు తెలిపారు. భీమడోలు పరీక్షా కేంద్రంలో ముగ్గురు, పూళ్ల పరీక్షా కేంద్రం నుంచి ఒకరు, గుండుగొలను పరీక్షా కేంద్రం నుంచి ఇద్దరు, ఆగడాలలంక పరీక్షా కేంద్రం నుంచి ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని తెలిపారు.

చింతలపూడి :మండలంలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఆరు సెంటర్లకు 1276 మంది విద్యార్థులకు 1250 మంది హాజరయ్యారు. 26 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ రామారావు తెలిపారు.



నిత్యావసరాలు, పౌష్టికాహారం అందిస్తున్న దాతలు

వికలాంగులకు చేయూత

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను గ్రామానికి చెందిన విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెల దాతల సహకారంతో వికలాంగులకు సన్న బియ్యం, నిత్యావసరాలు, పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. గ్రామానికి చెందిన దాత ఇందుకూరు సత్యనారాయణ రాజు 50 మంది వికలాంగులకు వీటిని సోమవారం అందించినట్లు సమితి గౌరవాధ్యక్షులు పేరిచర్ల శ్యామలరాజు తెలిపారు. వీటితో పాటు వృద్ధాప్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్చక దంపతులకు రూ.ఐదు వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన విద్యార్థి సిరిబత్తిన శిరీష పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారికి ఆహార పొట్లాలు అందించారు. సేవా సమితి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు రూ.15 వేల విరాళాన్ని గ్రామానికి చెందిన పొదిలాపు రాము అందించారని సమితి గౌరవాధ్యక్షులు శ్యామలరాజు తెలిపారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి - మండవల్లి

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పు చేసినట్లు ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సిడిపిఒ ఆనంద్‌బాబు తెలిపారు. మంగళవారం నుంచి మే 31వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని ఆయన వివరించారు.

పోలవరం : ఐసిడిఎస్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పని సమయాన్ని మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు పోలవరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి తెలిపారు. ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తాయని రాణి అన్నారు. మే ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్లకు, మే 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హెల్పర్లకు వేసవికాలం సెలవు దినాలుగా ఉన్నందున మే ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ హెల్పర్లు, మే 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తారని తెలిపారు.

జిబి బాటిల్స్ కంపెనీ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు

దళిత గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యంగా సిఎం వైఎస్.జగన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ఐటీ జాయింట్ డైరెక్టర్ విఆర్‌విఆర్ నాయక్ అన్నారు. మండలంలోని వెంకటాయపాలెం, కొత్తూరు తండా పరిధిలోని హటియ తండాలో మాజీ సర్పంచి బాణావతు గోపియానాయక్ రూ.ఐదు కోట్ల ప్రభుత్వ ప్రోత్సాహంతో రాయల్ ఛాలెంజ్ వారి సౌజన్యంతో జిబి బాటిల్స్ కంపెనీ నెలకొల్పారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా డిఐసి జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు, సెంట్రల్ జిఎస్‌టి, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ పి.రాజేశ్వరరావు, డ్వామా పీడీ హనుమాన్ నాయక్ పాల్గొని ప్రసంగించారు. విఆర్‌విఆర్. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం కల్పించే పారిశ్రామిక రాయితీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డిఐసి జిఎం పిఎస్.దాస్ మాట్లాడుతూ



కంపెనీ ప్రారంభిస్తున్న వక్తలు

ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ద్వారా అందుతున్న సబ్సిడీ రుణాలను ఎక్కువమంది వెహికల్స్ కొనుగోలుకు మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. అనంతరం గోపియానాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు కనకరాజు, శ్రీనివాసరావు, హనుమంతరావు, బిస్ ల్యాబ్ ఇన్‌ఛార్జి శివ కార్తీక్, డిఐసి ఐపిఒ యువరామకిషోర్, కొత్తూరు తండా సర్పంచి శ్రీనివాసరావు, వెంకటాయపాలెం సర్పంచి డోలా ప్రభాకరరావు, తావూరియా నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చాట్రాయి

ఉపాధి హామీ కూలీలకు రెండు వందల రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ చాట్రాయి ఎంపిడిఒ కార్యాలయం వద్ద అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ 2008 నుంచి ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిందని, ఏ పనులు ఉండని కష్ట కాలంలో గ్రామీణ పేదలకు వంద రోజులు పని కల్పించటం కోసం ఒక ఆసరాగా ఈ చట్టం వచ్చిందని చెప్పారు. దేశవ్యాప్తంగా 30 కోట్ల గ్రామీణ కార్మికులను ఈ వంద రోజుల పనే కరోనా సమయంలో ఆదుకుందని, మొత్తం 32 శాతం గ్రామీణ పేదలను దుర్భర పేదరికం నుంచి ఆదుకుందని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్య ఎన్నడూ లేనంతగా పెరిగిపోతున్న నేటి పరిస్థితుల్లో పని దినాలు, దినవేతనం పెంచటానికి బదులు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులను తగ్గించి వేసిందన్నారు. గ్రామీణ కార్మిక కుటుంబాలకు సంవత్సరంలో 200 రోజుల పని కల్పించి, కూలి రోజుకు రూ.600 వేతనం చెల్లించేలా చట్టం తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న అమరావతి ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూతం మారయ్య, చాట్ల బాబూరావు, బి.ఆనందరావు, అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు పరికల కళావతి, డిపూజిత, బొలమాల సీతామహాలక్ష్మి, ఎలమర్తి కుమారి, పర్సాచిట్టిమ్మ, కొమ్ము వెంకటేశ్వరరావు, గొల్లమందల నారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేయాలని నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు అన్నారు. చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న టౌన్ సచివాలయం-1, నాగిరెడ్డిగూడెం సచివాలయం-3, బోయగూడెం సచివాలయం-5 పరిధిలో కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లకు మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 2024లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కె.నాగు, మండల గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీప్, వైసిపి యూత్ మండల ప్రెసిడెంట్ వెంప కృష్ణ, విద్యార్థి విభాగం సెక్రటరీ ప్రకాష్, కమిషనర్ రాంబాబు, కన్వీనర్లు, పెద్రాజు, కన్నబాబు, లలిత కుమారి, బండారు గోపి కురిసెట్టి జోత్స్న, సీనియర్ నాయకులు నరేంద్రరాజు, దేవానందం పాల్గొన్నారు.

నూజివీడులో ట్రాఫిక్ సమస్య

వాహనదారుల అవస్థలు
పార్కింగ్ స్థలం చూపాలని వేడుకోలు



నూజివీడులో ట్రాఫిక్

ప్రజాశక్తి - నూజివీడు

పట్టణంలో ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల వద్ద ట్రాఫిక్ జామ్ కావడం పరిపాటిగా మారింది. కోర్టులకు ప్రభుత్వ కార్యాలయాలకు విఐపిలు, రాజకీయ నాయకులు వచ్చే సందర్భంలో మరిన్ని ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మున్సిపల్ అధికారులు, పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో మైలవరం రోడ్డులోని ప్రభుత్వ కార్యాలయాలు కోర్టులకు వచ్చే ప్రజలు, కక్షిదారుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలం చూపించాలని పలువురు సామాజికవేత్తలు కోరుతున్నారు. కోర్టుల సముదాయం, నూజివీడు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లు, పట్టణ రూరల్ సర్కిల్ కార్యాలయాలు, తహశీల్దార్, సబ్ కలెక్టర్, సబ్ ట్రెజరీ కార్యాలయాలతో పాటు సబ్ జైలు కూడా ఈ ప్రాంతంలోనే ఉండడంతో నిత్యం అనేక కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలు, కోర్టు సేవలు పొందే కక్షిదారులతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక సోమవారం అయితే రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. విఐపిలు, ప్రముఖ రాజకీయ నాయకులు వస్తుంటే మరింతగా రద్దీ పెరగడం ఖాయం. ఈ ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు పోలీసులు ఎన్ని ఫీట్లు చేసినా ఫలితం లేకపోతుంది. అన్ని శాఖల అధికారుల సమన్వయంతోనే పార్కింగ్ స్థలం చూపటం ఒక్కటే ఈ సమస్యకు చక్కని పరిష్కార మార్గంగా పలువురు సామాజిక వేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి జటిలమైన ట్రాఫిక్ సమస్యకు తక్షణ పరిష్కారాన్ని సూచించాలని పలు ప్రజాసంఘాల నేతలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని మెట్టగూడెం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతకళ అన్నారు. మండలంలో డీఫర్ లైఫ్ వెల్ఫేర్ సొసైటీ వారి సౌజన్యంతో ఎంపియుపి మెట్టగూడెం పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు రూ.నాలుగు వేల విలువైన ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, విద్యాసామగ్రి అందించారు. అనంతరం యుటిఎఫ్ మండల అధ్యక్షులు దామోదర్ మాట్లాడుతూ పిల్లలు చక్కగా చదువుకొని మంచి స్థాయికి ఎదిగి, పేదలకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ కంచర్ల బుచ్చిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.